# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పున:ప్రారంభించారు.
- ❖ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు.
- ❖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషితో వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవచ్చని "20 సూత్రాల కార్యక్రమ అమలు" నూతన చైర్మన్ లంకా దినకర్ తెలిపారు.
- ❖ తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 21వ తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పున:ప్రారంభించారు. ఇందులో భాగంగా రాయపూడి వద్ద జీ ప్లస్ - 7 విధానంలో నిర్మిస్తున్న సీఆర్డీయే కార్యాలయ పనులు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అమరావతిలో 160 కోట్ల రూపాయలతో జీ ప్లస్ - 7 భవనం నిర్మిస్తున్నామని, 4 నెలల్లో దీనిని పూర్తి చేస్తామని అన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం అమరావతి అని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన పంటలను ఈరోజు ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 300 కోట్ల రూపాయల మేర

పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాధమికంగా అంచనా వేయడం జరిగిందన్నారు. పంట వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకుంటామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

వికసిత్ భారత్ - 2047 అమల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమ అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమ అమలు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2047 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దేశంగా భారత దేశాన్ని అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో "వికసిత్ భారత్ 2047" కార్యక్రమాన్ని చేపడితే 2.40 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దే లక్ష్యంతో "స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్" ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషితో ఈ లక్ష్యాన్ని సాధిస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

===========================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు ఆశీర్వదిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జున్నూరులో "పల్లె పండుగ" కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. 35 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిమెంట్ రహదారులు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే పెన్షన్ల పెంపు, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు, నవంబర్ నుంచి పోలవరం పనుల ప్రారంభం, రైతులకు 25 వేల రూపాయలు అందించే కార్యక్రమాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు.

విరామం

===========================

రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో విజయనగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి ఈరోజు పరిశీలించారు. పథకం అమలు తీరును, పాఠశాలలో ఉన్న వంట గదులను, స్టోర్ రూములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న ఆహారం మెనూ ప్రకారం అమలు అవుతున్నదా లేదా అని ఆమె పరిశీలించారు. వండిన ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. రెండు రోజులుగా 10 పాఠశాలలను తనిఖీ చేసిన ఆమె.. పలుచోట్ల వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించారు. వంట గదులు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి, డయేరియాకు గురవుతారని సిబ్బందిని హెచ్చరించారు.

===========================

గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా ఈరోజు 2 కోట్ల 50 లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల 362 పంచాయతీల్లో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఎక్కువ ఉపయోగపడే రోడ్లు, డ్రైన్లు, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఇక్కడే ఉపాధి కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు.

==============================

ఉపరితల ఆవర్తనం మధ్య అండమాన్ సముద్ర ప్రాంతంలో సగటు సముద్రమట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్త వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో ఈనెల 21వ తేదీన  తూర్పు మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం ఉత్తర వాయువ్య దిశగా పయనించి ఈనెల 23వ తేదీన వాయుగుండంగా బలపడే అవకాశముందని వెల్లడించింది.

==============================

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి రణస్థలం మండలం కొవ్వాడలో నిర్మితమవుతున్న అణు విద్యుత్ ప్లాంట్ ఎంతగానో ఉపయోగ పడుతుందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈరోజు శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో  ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్. ఈశ్వరరావు, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణంపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అణువిద్యుత్ ప్లాంట్ వల్ల నష్టపోతున్న నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో కూడిన కాలనీలు, ఇతర మౌలిక వసతులు ధర్మవరం గ్రామంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొవ్వాడ మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణం శరవేగంగా జరగనుందని శాసన సభ్యులు ఎన్. ఈశ్వరరావు మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరపై రైతులు అవగాహన పెంపొందించు కోవాలని కాకినాడ జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.దేవుల నాయక్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో రైతులు పండిచిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులు నష్టపోకూడదనే లక్ష్యంతో ధాన్యం సేకరణలో నాణ్యత ప్రమాణాలకు లోబడి వున్న ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించడం జరిగిందన్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లాలో 277 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయటం జరిగిందని ఆయన తెలియజేశారు.

==============================

“ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన”, “ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన”ను సద్వినియోగం చేసుకోని కుటుంబానికి రక్షణగా నిలవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కేంద్రం భీమవరంలో ఈరోజు కలెక్టర్ మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తుందని తెలియజేశారు.

==============================
==============================